సాక్షి ప్రకాశం

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025

I



బస్సుజాతా జయప్రదం చేయండి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పెండింగ్, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, తదితర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 22 నుంచి చేపట్టిన బస్సు జాతాను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు.

- IIలో..



రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందగా, రోడ్డుకు అడ్డంగా లారీ ఆగిపోయి 6 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిన సంఘటన నల్లమల ఘాట్ రోడ్డులో జరిగింది.

- IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31 /25

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అక్రమ కేసులు ఎత్తివేయాలి



మార్కాపురం: సాక్షి దినపత్రికపై పెట్టిన అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై వార్తలు రాశారన్న కక్షతో కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. పత్రికా వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పత్రికల్లో వచ్చిన వార్తలు నచ్చకపోతే ఖండన ఇవ్వవచ్చని, అంతేగానీ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం తగదని అన్నారు. పత్రికా కార్యాలయాలకు వెళ్లి పోలీసులు సోదాలు చేయడం మంచి సంప్రదాయం కాదని ఆయన అన్నారు.

ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఫెన్సింగ్ అండర్ - 14 జిల్లా క్రీడాకారులను గురువారం స్థానిక మినీ స్టేడియంలో ఎంపిక చేశారు. ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ ఆధ్వర్యంలో ఫాయిల్, ఈపీ, సాబ్రే విభాగాలలో ఎంపిక జరిగింది. ఈపీ విభాగంలో బాలబాలికలు ఎంపికవగా, ఫాయిల్, సాబ్రే విభాగాలలో బాలురు మాత్రమే ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 18 నుంచి కాకినాడలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని నవీన్ తెలిపారు.

ఫాయిల్ విభాగంలో ఎంపికైన బాలురు : జి.తనీష్, జె.జగదీశ్వర్, కె.భవేష్, డి.రాహుల్

ఈపీ విభాగంలో ఎంపికైన బాలురు : జె.సాయిచరణ్, డి.చరణ్ సాయి ఫణీశ్వర్, సీహెచ్ జ్ఞానేశ్వర్, టి.లలిత్ చౌదరి

ఈపీ విభాగంలో బాలికలు : బి.సౌమ్యశ్రీ, డి.ప్రియ, టి.మృధుల, సీహెచ్ జైత్రశ్రీ

సాబ్రే విభాగంలో బాలురు : షేక్ అయాన్ మహీబ్, డి.రోహిత్, దేవాన్ష్



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఓవర్ వసూళ్లు జాప్యం

జాతీయ రహదారులపై రయ్..రయ్ మంటూ వెళుతున్న వాహనాదారులకు టోల్ ప్లాజాల వద్ద చుక్కలు కనిపిస్తున్నాయి. యాజమాన్యాలు తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలు, నిర్లక్ష్యం ఫలితంగా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఓవర్ లోడ్ పేరుతో అదనంగా వసూళ్లు చేస్తుండడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. పలు సందర్భాల్లో టోల్ దాటాలంటే అరగంటకుపైగా సమయం పడుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- టోల్ ప్లాజాల వద్ద లారీలకు ఓవర్ లోడ్ పేరుతో అదనపు వసూళ్లు
- చెల్లింపు ప్రక్రియ ఆలస్యం
- కిలోమీటర్ల మేర నిలిచిపోతున్న వాహనాలు
- వాహనదారులు, ప్రయాణికులకు అవస్థలు
- రూ.లక్షల్లో ఓవర్ లోడ్ రుసుం వసూలు
- పట్టించుకోని అధికారులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న టోల్ ప్లాజా యాజమాన్యం



టంగుటూరు టోల్ ప్లాజా వద్ద నెల్లూరు వైపు నిలిచిన వాహనాలు

టంగుటూరు:

జాతీయ రహదారి - 16పై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. టోల్ ప్లాజాల వద్ద ఎలాంటి జాప్యం జరుగకుండా ఫాస్ట్‌ట్యాగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. టోల్ ప్లాజా వద్ద బిల్లింగ్ కేంద్రాలతో సంబంధం లేకుండా వెళ్లే సౌకర్యం ఉంది. కానీ, ఇటీవల కాలంలో కొన్ని టోల్ ప్లాజాల నిర్వాహకులు తీసుకుంటున్న చర్యలు వాహనదారులను అవస్థలపాలుజేస్తోంది. విజయవాడ-నెల్లూరు మధ్య సింహపురి ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ ఆధ్వర్యంలో టంగుటూరు, ముసునూరు, బొల్లాపల్లి టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఎక్కడా లేని విధంగా వీటిల్లో పెద్ద వాహనాలకు ఓవర్ లోడ్ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఓవర్ లోడ్ వసూలు చేసే సమయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పలు అంబులెన్సులు, ఎమ్మెల్యేల వాహనాలు సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి. కనీసం అంబులెన్సు ఉన్న సమయంలో కూడా ట్రాఫిక్ క్రమబద్ధీకరించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టోల్ ప్లాజాల వద్ద ప్రతి రోజూ ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. అత్యవసర పనుల నిమిత్తం వెళ్లేవారు, బస్సుల్లో కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఆస్పత్రులకు పోయే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టోల్ ప్లాజా వద్ద వాహనం 10 సెకన్ల కంటే ఎక్కువ సేపు వేచి ఉండాల్సి వస్తే టోల్ చెల్లించాల్సిన అవసరం లేదని నిబంధన ఉంది. దీనిని నిర్వాహకులు పట్టించుకుంటున్న దాఖల్లాల్లేవు.



టోల్ ప్లాజా వద్ద ఓవర్ లోడ్‌కు పెనాల్టీ చెల్లిస్తున్న కంటైనర్

ఓవర్ లోడ్ పేరుతో ఓవరాక్షన్...

టంగుటూరు, ముసునూరు, బొల్లాపల్లి టోల్ ప్లాజాల్లో ఓవర్ లోడ్ పేరుతో ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ రూ.లక్షల్లో ఓవర్ లోడ్ ఫీజు వసూలు చేస్తూ తమ ఖజానా నింపుకుంటున్నారు. వాస్తవానికి రవాణా శాఖ అధికారులు విధించాల్సిన ఓవర్ లోడ్ ఫీజు టోల్ ప్లాజాల్లో వసూలు చేస్తూ వాహనదారుల జేబుకు చిల్లుపెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అటు ప్రభుత్వంగానీ, ఇటు అధికారులుగానీ పట్టించుకోవడం లేదు.

సమయం వృథా అవుతోంది



చేప పిల్లల లోడు లారీతో నెల్లూరు వైపు వెళ్తుంటాను. టంగుటూరు, ముసునూరు, బొల్లాపల్లి టోల్ ప్లాజాల యాజమాన్యాలు మోసం చేస్తున్నాయి. టంగుటూరు టోల్ ప్లాజాలో ఓవర్ లోడ్ టన్ను ఉందంటూ ఒక్కో ప్లాజాలో అరగంట పాటు లారీ ఆపుతున్నారు. ఓవర్ లోడ్ డబ్బులు రూ.280 వసూలు చేస్తున్నారు. మళ్లీ కాటా పెడితే పాసింగు ఉందని, తిరిగి డబ్బులిస్తున్నారు. దీంతో సమయం వృథా అవుతోంది. చేప పిల్లల లోడుకు ఆక్సిజన్ ఉంటుంది. ఏదైనా తేడా పడి చేప పిల్లలు చనిపోతే రూ.లక్షల్లో నష్టం వస్తుంది. టోల్ ప్లాజాకు ఇరువైపులా ఉన్న కాటాలు తేడాగా ఉన్నాయి. అధిక లోడు చూపిస్తోంది. తూనికలు, కొలతల అధికారులు తనిఖీలు నిర్వహించాలి.

– వీర్ల సత్యనారాయణ, లారీ డ్రైవర్, గుడివాడ

వాహనదారులకు అందని సేవలు...

టోల్ ప్లాజాల్లో వాహనదారులకు సేవలందించేందుకు టోల్ ఫ్రీ నంబరు 1033 ఉంది. దానికి వాహనదారులు ఫోన్ చేస్తే సిబ్బంది స్పందించరు. టోల్ ప్లాజా పెట్రోలింగు వాహనం ఎక్కడ ఉంటుందో తెలియదు. వారి పర్యవేక్షణ కొరవడటంతో రాత్రి పూట లారీ డ్రైవర్లు రోడ్డు పక్కన పెట్టుకుని నిద్రపోతూ ఉంటారు. ఆ సమయంలో ఆయిల్ దొంగలు అదే అదునుగా చూసుకుని లారీ ట్యాంకుల్లో డీజిల్ కాజేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాగే జాతీయ రహదారి అంబులెన్సుల్లో ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులు ఉండవు. అధికారులు ఇస్తున్నా అంబులెన్సు సిబ్బంది అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేయాల్సిన వైద్యులు, సిబ్బంది లేరని, వాటిని అలంకార ప్రాయంగా సింగరాయకొండలోని కలికవాయి వద్ద ఉంచుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



సింగరాయకొండ వద్ద అలంకారప్రాయంగా ఉన్న జాతీయ రహదారి అంబులెన్సు



ఒంగోలువైపు భారీగా నిలిచిన వాహనాలు

ప్రతిరోజూ గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్...

టోల్ ప్లాజా యాజమాన్యం ఓవర్ లోడ్ పేరుతో నగదు వసూళ్లు చేస్తుండటంతో ప్రతిరోజూ గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ తీరు ఒక రోజు అర రోజు కాదు.. నిత్యం కొనసాగుతోంది. ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్న వాహనదారుల కష్టాలు అన్నీఇన్నీ కావు. ప్రతిరోజూ వాహనదారులు స్థానిక పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేస్తుండటంతో వారు వచ్చి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేస్తున్నారు. అది కూడా కొంత సమయమే. మళ్లీ పరిస్థితి మొదటికొస్తోంది.

బినామీల కోసమే ప్రైవేటీకరణ

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు చంద్రబాబు దుర్బుద్ధే కారణం
- ఆయన స్వార్థానికి పేదలకు విద్య, వైద్యం దూరం
- పేద విద్యార్థులకు తీరని అన్యాయం
- కనీస అవసరాలు తీర్చలేని సీఎం ఎందుకు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ధ్వజం
- పేదలకు విద్య, వైద్యం జగనన్నకే సాధ్యమని స్పష్టం
- దర్శి నగర పంచాయతీలోని కొత్తరెడ్డి పాలెంలో కోటి సంతకాల సేకరణ



కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా సంతకాలు చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ



కార్యక్రమంలో భారీగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు

దర్శి: పేద ప్రజలకు విద్య, వైద్యం అందించడం మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో దర్శి నగర పంచాయతీ పరిధిలోని కొత్తరెడ్డిపాలెం రచ్చబండ వద్ద గురువారం కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ ఆవుల జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముందుగా సంతకాలు చేసి కోటి సంతకాల ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు తీసుకొచ్చారన్నారు. వాటిని కొనసాగిస్తే జగనన్నకు ఎక్కడ మంచి పేరు వస్తుందో అనే దుర్బుద్ధితో పాటు తన బినామీల కోసం ప్రభుత్వ, ప్రైవేట్, పార్టనర్‌షిప్ (పీపీపీ) పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం చేసి పేదల నోట్లో మట్టి కొట్టి చరిత్రహీనుడిగా సీఎం చంద్రబాబు మిగిలిపోయారన్నారు.

పేదలకు ఉచిత వైద్యం, వైద్య విద్య ఎలా అందుతాయి..?

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలల్లో ఐదు అందుబాటులోకి వచ్చి తరగతులు, వైద్య సేవలు అందిస్తుండగా, మరో 12 కళాశాలలు నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్నాయని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు వాటిని ప్రైవేటీకరిస్తే పేద విద్యార్థులకు మెడికల్ కళాశాలల్లో ఉచిత వైద్య విద్య, పేద రోగులకు ఉచిత వైద్యం ఎలా అందుతాయని ప్రశ్నించారు. జిల్లాలోని మార్కాపురం మెడికల్ కళాశాల పనులు 70 శాతం పూర్తయ్యాయని, ఎంతో నాణ్యతతో నిర్మాణాలు కూడా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టారని చెప్పారు. పశ్చిమ ప్రాంత ప్రజలు తమకు మెడికల్ కళాశాల వచ్చిందని ఎంతో సంతోషించారని తెలిపారు. కానీ, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు చంద్రబాబు తీరని అన్యాయం చేశారన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఒంగోలులో నిర్మించిన రిమ్స్, జీజీహెచ్‌లో నేటికీ వేలాది మంది ఉచిత వైద్యం చేయించుకుంటున్నారని గుర్తుచేశారు. కోవిడ్ హయాంలో ఎంతో మంది బాధితులకు పైసా ఖర్చు లేకుండా కాపాడారన్నారు. జగనన్న ఆశయాలకు చంద్రబాబు తూట్లు పొడుస్తూ పేద ప్రజలను జలగల్లా పీక్కుతినేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో అమరావతి అభివృద్ధి పేరుతో ఇప్పటికే రెండు లక్షల కోట్లకుపైగా అప్పు తెచ్చిన చంద్రబాబు.. మెడికల్ కళాశాలల నిర్వహణకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేయలేరా..? అని ప్రశ్నించారు. ఇదేనా పేదలపై మీకున్న చిత్తశుద్ధి అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల కనీస అవసరాలు తీర్చలేని సీఎం ఆ పదవికి అర్హుడేనా అని ప్రశ్నించారు. దీనికి నిరసనగా దర్శి నియోజకవర్గంలో 60 వేలకుపైగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 28న భారీ ర్యాలీ నిర్వహించి రెవెన్యూ కార్యాలయంలో, నవంబర్ 12న కలెక్టర్ కార్యాలయంలో అర్జీలివ్వనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో అందరూ కలిసికట్టుగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని బూచేపల్లి పిలుపునిచ్చారు.



వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు

చరిత్రహీనుడిగా చంద్రబాబు...

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య శ్రీ, 108, 104, అమ్మ ఒడి, ఉచిత విద్య, వైద్యం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలలో అమలు చేశారని వివరించారు. కరోనాను సైతం ఆరోగ్య శ్రీలో చేర్చి పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. నేడు చంద్రబాబు హయాంలో ఆరోగ్య శ్రీ కూడా సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను తన స్వార్థం కోసం చంద్రబాబు ప్రైవేటుపరం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నిర్ణయం వెంటనే వెనక్కు తీసుకోకపోతే చంద్రబాబు చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని హెచ్చరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మలను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అధిక సంఖ్యతో ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరై మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డు రామారావు, మండల కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, యన్నాబత్తిన సుబ్బయ్య, కాకర్ల కృష్ణారెడ్డి, తూము వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడికొండ జయంతి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సైదా, క్రిస్టియన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటు పోలయ్య, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొల్లా ఉదయభాస్కర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, కేసరి రాంభూపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రెడ్డి, ఎంపీటీసీల సంఘ అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబూరావు, మాజీ ఎంపీపీలు గోళ్లపాటి మోషె, ఇత్తడి దేవదానం, క్రిస్టియన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కృపానందం, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గర్లెపోగు ఏసుదాసు, విద్యార్థి విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు కోరే సుబ్బారావు, షేక్ షకీలా అమీన్ బాషా, మేడగం బాలకృష్ణారెడ్డి, ఆవుల శివారెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, కేసనపల్లి నాగేశ్వరరావు, అన్నవరపు రవి, చెరుకూరి జగన్, నుసుం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే ప్యాకేజీ.!

- వెలిగొండ నిర్వాసితుల నుంచి వసూళ్ల పర్వం మొదలు
- ఒక్కొక్క కుటుంబం రూ.20 వేలు చెల్లించాలని ఒత్తిడి
- నగం కూటమి నాయకుడికి, నగం టీడీపీ వర్గీయులకు



గుండంచెర్ల గ్రామం వ్యూ

యర్రగొండపాలెం: డబ్బులిస్తేనే ప్యాకేజీ మంజూరు చేయిస్తామని వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల నుంచి డబ్బు వసూలు చేసేందుకు టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. ఒక్కొక్క కుటుంబం రూ.20 వేల చొప్పున చెల్లిస్తే వెంటనే ప్యాకేజీ మంజూరవుతుందని ప్రచారం మొదలు పెట్టడంతో పాటు కొంతమంది వద్ద డబ్బు వసూలు చేసినట్లు తెలిసింది. వసూలైన సొత్తు నుంచి కూటమి నాయకుడికి రూ.10 వేలు, మిగిలిన రూ.10 వేలలో స్థానిక నాయకులు, అధికారులకు ముట్టజెప్పాల్సి ఉంటుందని వారు వివరిస్తున్నట్లు తెలిసింది. పెద్దారవీడు మండలంలోని సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల గ్రామాలకు చెందిన మొత్తం నిర్వాసిత కుటుంబాలు 5,126 ఉన్నాయి. వాటిలో 3,760 కుటుంబాలు అవార్డు పొందగా, 1,360 కుటుంబాల జాబితాను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. వీరి నుంచి దాదాపు రూ.10 కోట్లు వసూలు చేసేందుకు పచ్చ నాయకులు పూనుకున్నారు. డబ్బు వసూళ్ల పర్వం బహిరంగంగానే జరుగుతోందని ఆయా ప్రాంతాల నిర్వాసితులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ కోసం తమ సొంత గ్రామాలను వదిలిపెట్టి దూరంగా వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్నామని, తమకు ప్రభుత్వ పరంగా రావాల్సిన ప్యాకేజీ కోసం ఎదురు చూస్తుంటే.. టీడీపీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. సుంకేసుల పంచాయతీలో 2756 కుటుంబాలు ఉండగా, 1,900 అవార్డు పొందారు. 856 పెండింగ్‌లో ఉన్నాయి. కలనూతల పంచాయతీలోని 1,170 కుటుంబాలలో 1,030 అవార్డులు పొందగా, 140 కుటుంబాలు పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా గుండంచర్ల పంచాయతీలో 1,200 కుటుంబాలలో 830 అవార్డు పొందగా, 370 కుటుంబాలవి పెండింగ్‌లో ఉంచారు. అవార్డు పొందిన వారితో పాటు పెండింగ్‌లో ఉన్న కుటుంబాలకు కూడా వెంటనే ప్యాకేజీ మంజూరు చేయిస్తామని పచ్చనేతలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అవినీతి అక్రమాల నుంచి తమను కాపాడాలని నిర్వాసితులు కోరుతున్నారు.

నల్లమలను జల్లెడ పట్టిన బలగాలు

- ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో శ్రీశైలం వెళ్లే వాహనాల నిలిపివేత
- ఇబ్బందులు పడిన యాత్రికులు



శ్రీశైలం రహదారిలో భారీగా నిలిచిన వాహనాలు

పెద్దదోర్నాల: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీశైలం పర్యటనతో నల్లమల అటవీ ప్రాంతాన్ని గ్రేహౌండ్ బలగాలు, పోలీసులు జల్లెడ పట్టారు. గురువారం ఉదయం కర్నూలులోని ఓర్వకల్లుకు ప్రత్యేక విమానంలో చేరుకున్న నరేంద్ర మోదీ.. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా నంద్యాల జిల్లా సున్నిపెంట చేరుకుని శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు నల్లమల అభయారణ్యంలోని ప్రతి ప్రాంతాన్ని గ్రేహౌండ్ దళాలు జల్లెడ పట్టాయి. దీంతో పాటు అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలికాప్టర్ ద్వారా భద్రతను పర్యవేక్షించారు. పెద్దదోర్నాల మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రతి 10 కిలోమీటర్లకు ఓ సెక్యూరిటీ పాయింట్ ఏర్పాటు చేశారు. ప్రతి పాయింట్‌లో ఓ ఇన్‌స్పెక్టర్‌తో పాటు 8 మంది పోలీసులను ఉంచి నల్లమలలో సంచరించే వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టారు. దీంతో పాటు అభయారణ్యంలోని ముఖ్యమైన ప్రాంతాలలో వాహనాలు మరమ్మతులకు గురై రోడ్లపై నిలిచిపోగా, ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా క్రేన్లు, బుల్‌డోజర్లు ఏర్పాటు చేసి తొలగించారు. మండల కేంద్రంలోని గణపతి చెక్‌పోస్టు నుంచి శిఖరం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మొబైల్ పార్టీ పోలీసులను ఏర్పాటు చేశారు. కాగా, మండల కేంద్రంలోని మల్లికార్జుననగర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీశైలం వెళ్లే వాహనాలను నిలిపివేయడంతో ప్రయాణికులు, యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులు భోజన వసతి కోసం అవస్థపడ్డారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు, యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్‌రావు, ఎస్సై మహేష్‌లు మండలంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

డైట్‌లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



తయారు చేసిన వంటకాలతో విద్యార్థులు

ఒంగోలు సిటీ: అంతర్జాతీయ ఆహార దినోత్సవం సందర్భంగా మైనంపాడు డైట్ కళాశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డైట్ ప్రిన్సిపల్ సామా సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు వివిధ రకాల వంటలను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరూ వంటకం తయారీ విధానం, దానిలో ఉన్న పోషక విలువ గురించి వివరించారు. వారు చేసిన ప్రత్యేక వంటకాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్ వంటకాలు రుచి చూసి విద్యార్థులను అభినందించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఒంగోలు సిటీ: గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం కరవది–ఒంగోలు రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. ఒంగోలు రైల్వే స్టేషన్ ఆన్‌డ్యూటీ స్టేషన్ మాస్టరు ఫిర్యాదు మేరకు జీఆర్పీ ఎస్సై మధుసూధనరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు..కరవది–ఒంగోలు రైల్వేస్టేషన్ల మధ్య 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతున్న క్రమంలో, లేదా తనంతట తాను రైలు ఢీకొని మృతి చెందాడా అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి 5.5 అడుగుల ఎత్తు ఉన్నాడు. మృతున్ని గుర్తించేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుని వివరాలు తెలిస్తే 9440627647 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

టంగుటూరు: కడుపునొప్పి భరించలేక ఎలుకల మందు తిని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని కారుమంచిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. చీరాలకు చెందిన వహీద(25)కు కారుమంచికి చెందిన అరవింద్‌లో ఆరేళ్ల క్రితం వివాహమైంది. అయితే ఆమె కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆస్పత్రిలో చూయిస్తున్నా తగ్గలేదు. విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కూడా కారుమంచి వచ్చి వెళ్లారు. పెద్ద ఆస్పత్రిలో చూయిస్తామని చెప్పారు. ఈ క్రమంలో గత నెల 25న విపరీతమైన కడుపు నొప్పి రావడంతో భరించలేక ఇంట్లోనే ఎలుకలమందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన భర్త అరవింద్ ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ మేరకు వహీదా తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టంగుటూరు తహసీల్దార్ ఆంజనేయులు ఒంగోలు జీజీహెచ్‌లో శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

జేపీ చెరువులో చోరీకి విఫలయత్నం

రాచర్ల: అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు సరుడును దొంగలించేందుకు గుర్తు తెలియని దుండగుడు విఫలయత్నం చేశాడు. ఈ సంఘటన మండలంలోని జేపీ చెరువు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కొక్కు అంకమ్మ తన నివాసంలో బుధవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని దుండగుడు వచ్చి బంగారు సరుడును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో అంకమ్మ అప్రమత్తమై పెద్దపెట్టున కేకలు వేయడంతో దుండగుడు పరారయ్యాడు. చోరీకి వచ్చిన వ్యక్తి టోపీ సంఘటన స్థలంలో పడిపోయిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

18 నుంచి సైన్సు సంబరాలు

ఒంగోలు సిటీ: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు వెంకట్రావు, జి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ నెల 18న 8, 9, 10 తరగతులకు విద్యార్థులకు సైన్సు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పాఠశాల స్థాయిలో మొదటిస్థానం పొందిన విద్యార్థులను ఎంపిక చేసి ముగ్గురు విద్యార్థులను ఆ పాఠశాల జట్టుగా నవంబర్ 1న జరగనున్న మండల, పట్టణ స్థాయి చెకుముకి సైన్సు సంబరాలకు పంపాలన్నారు. పూర్తి వివరాలకు 8309335057, 9948220868 ను సంప్రదించాలని కోరారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు సైన్సుపై ఆసక్తి పెంపొందించేందుకు చెకుముకి సంబరాలు ఉపయోగపడతాయన్నారు. పాఠశాల స్థాయి చెకుముకిలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు, విద్యాధికారులు విద్యార్థులను ప్రోత్సహించి జయప్రదం చేయాలని కోరారు.

ఆశల సాగు



వరి కయ్యల గట్లు సిద్ధం చేస్తున్న రైతులు



వరి నారు పీకుతున్న మహిళా కూలీలు





ముందస్తుగా సాగు చేసిన వరికి మందు పిచికారీ చేస్తున్న రైతులు

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతోపాటు సాగర్ కాలువకు నీరు రావడంతో వరి సాగు ఊపందుకుంది. తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి, దొనకొండ, త్రిపురాంతకం, సీఎస్‌పురం, పొదిలి, చీమకుర్తి,సింగరాయకొండ, కొండపి తదితర ప్రాంతాల్లో మాగాణి భూములు దమ్ము చేసి వరినాట్లు వేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తున్న ఆశలు సన్నగిల్లినా సేద్యపు పనుల్లో మాత్రం తగ్గేదే లేదని తెగేసి చెబుతున్నారు.

– సాక్షి, ఒంగోలు



యూరియా వేస్తున్న రైతు



నారు కట్టలను కూలీలకు అనువుగా సిద్ధంగా ఉంచుతున్న మహిళ



మాగాణి చదును చేస్తున్న రైతు



నాట్లు వేస్తున్న మహిళలు

అమాయకులపైనా మీ దాష్టికం?

- అటవీశాఖ అధికారుల తీరుపై పోగుళ్ల వాసుల ఆందోళన
- అక్రమ కేసులు బనాయించారని ఆరోపణ



అటవీశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న తిమ్మయ్య బంధువులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీశాఖ అధికారులు అమాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని బేస్తవారిపేట మండలం పోగుళ్ల గ్రామస్తులు కొందరు ఆరోపించారు. పోగుళ్లకు చెందిన మేకల తిమ్మయ్యపై అక్రమ కేసు నమోదు చేసి నిర్బంధించారంటూ గిద్దలూరు రేంజ్ అటవీ శాఖ కార్యాలయం వద్ద అతని బంధువులు గురువారం ఆందోళన చేశారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. పోగుళ్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో 20 రోజుల క్రితంతిమ్మయ్య ఒక కొండముచ్చును చంపాడంటూ అటవీశాఖ అధికారులు విచారణకు వెళ్లారు. దీంతో అతను గ్రామ పెద్దలను ఆశ్రయించగా రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డితో చర్చించారు. తిమ్మయ్యను తీసుకొస్తే మాట్లాడి పంపిస్తామని చెప్పడంతో బుధవారం అటవీశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. గురువారం వరకు తిమ్మయ్యను విడిచిపెట్టకపోవడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ‘ మీకు ఏమీ కాదు అని చెప్పి రేంజ్ ఆఫీసర్ మా వద్ద రూ.50 వేలు వసూలు చేశారు. ఏమైందో ఏమో వణ్యప్రాణిని చంపారు, నాటు తుపాకీ దొరికింది’ అని ఇప్పుడు చెబుతున్నారు. కొండముచ్చును రేచ కుక్కలు చంపి పడేస్తే.. తిమ్మయ్య తుపాకీతో కాల్చి చంపాడని బలవంతంగా ఒప్పించి కాగితాలపై సంతకాలు చేయించుకున్నారని, ఇంత అన్యాయమా అని వాపోయారు. కార్యాలయంలోకి ఎవరు రాకుండా తలుపులు వేయడంపై తిమ్మయ్య బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై సత్యనారాయణ రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ×కేసు వివరాలు రాస్తున్నా, ఇప్పుడు నేను ఎవరినీ కలవలేను౯ అని సిబ్బందితో సమాధానం చెప్పించారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలి

- రాష్ట్రంలో పెండింగ్‌లో రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- మూతపడిన పాఠశాలలను పునఃప్రారంభించాలి
- ఎన్నిక హామీ మేరకు 107, 108, 77 జీఓలను రద్దు చేయాలి
- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుల్లాయిస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్



బస్సుజాత వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఒంగోలు సిటీ: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు ఈ నెల 22 నుంచి నవంబర్ 12 వరకు జరుగుతున్న బస్సుజాతలో విద్యార్థులంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుల్లాయిస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని లింగయ్య భవన్‌లో గురువారం బస్సుజాత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పీపీ విధానాన్ని ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యను కాపాడాలని, మూసి వేసిన పాఠశాలలను పునఃప్రారంభించాలని తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీ అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుకున్న దూరం చేసే జీఓ నంబర్ 77 రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న 3480 ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించి పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో జూనియర్ కళాశాలలు, నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బస్సు జాతాలో భాగంగా నవంబర్ రెండవ తేదీన ఒంగోలు పట్టణంలోకి వస్తామని, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నాయకులు తాహిద్, ఇఫ్రాజ్, లోకేష్, స్టాలిన్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

పొలం ఆక్రమించారు.. న్యాయం చేయండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్న బాధిత కుటుంబం

గిద్దలూరు రూరల్: తమ పొలాన్ని ఇతరులు ఆక్రమించుకున్నారని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఓ బాలింత తన భర్త రెడ్యా నాయక్, పసిబిడ్డతో కలిసి స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం ఆవేద వ్యక్తం చేసింది. బాధిత కుటుంబ కథనం మేరకు.. దిగువ మెట్ట తండాకు చెందిన కాంద్రావత్ లక్ష్మీబాయ్ జేజినాయన బుక్కె మంగ్యానాయక్‌కు అంబవరం రెవెన్యూ ఇలాకాలో 1962లో అప్పటి ప్రభుత్వం 3.38 ఎకరాల భూమి మంజూరు చేసింది. సంబంధిత పత్రాలు తమ వద్ద లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో విచారించగా రికార్డులో వివరాలు నమోదై ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న భూమిని ఆరేళ్ల క్రితం జయరాంపురం తండాకు చెందిన కరిమయ్య, అతని కుమారుడు గురవయ్య ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. దీంతో పోలీసులతోపాటు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. పొలం ఆక్రమించిన వారిని అప్పటి తహసీల్దార్ సీతారామయ్య పిలిపించి హెచ్చరించడంతో వెనక్కి తగ్గిన కరిమయ్య మళ్లీ భూమిలోకి ప్రవేశించాడు. నకిలీ పత్రాలు చూపుతూ తమను భూమిలోకి రానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. దీనిపై తహసీల్దార్ ఎం.అంజనేయరెడ్డి స్పందించారు. ప్రభుత్వం కేటాయించిన భూమిని కొనడం, అమ్మడం నేరమని, వెంటనే వారిని పిలిచి విచారించి న్యాయం చేస్తానని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు.

ఇష్టారాజ్యంగా మట్టి వ్యాపారం

ట్రాక్టర్ మట్టి రూ.700 ● కూటమి నేతల వాటా రూ.100



కొండ వద్ద ట్రాక్టర్ ట్రక్కులో మట్టి నింపుతున్న జేసీబీ(ఫైల్)



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న మట్టి

కంభం: కొండలు, తిప్పల వెంట ఇష్టానుసారంగా మట్టి తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నా సంబంధింత అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి నేతల మద్దతుతో అక్రమార్కులు సాగిస్తున్న మట్టి దందాను అడ్డుకునేందుకు ఏ అధికారీ ధైర్యం చేయడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అర్ధవీడు మండలంలోని నాగులవరం కొండ, కంభం మండలంలోని చిన్నకంభం, ఎల్‌కోట గ్రామాల వద్ద ఉన్న కొండలను జేసీబీలతో తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లతో యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ట్రాక్టర్ ట్రక్కు మట్టిని రూ. 700కు విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గృహాలు నిర్మించుకునే వారు చేసేదేమీ లేక వారు చెప్పినంత సొమ్ము చెల్లించి తమ అవసరాల కోసం మట్టిని తోలుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో స్థానికంగా ఉండే అధికార పార్టీ నాయకులు కొండల్లో మట్టి తోలే వారి వద్ద ఒక్కో ట్రాక్టర్‌కు రూ.100 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మట్టి దందాపై మౌనంగా ఉంటున్న అధికార యంత్రాంగం.. పరిస్థితిని బట్టి హడావిడి చేస్తుండటం చర్చనీయాంశమైంది.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

- పాత బ్రిడ్జిని ఢీకొని రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీ
- 6 గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్



ప్రమాదానికి గురై రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగిస్తున్న దృశ్యం

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట గ్రామ నల్లమల ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన లారీ డ్రైవర్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..కర్నూలు నుంచి విజయవాడ వెళుతున్న లారీ..ప్రమాదవశాత్తు నల్లమల్ల ఘాట్ రోడ్డు మలుపు వద్ద పాత బ్రిడ్జిని ఢీకొట్టింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ బి.రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ రోడ్డుగా నిలిచిపోవడంతో నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వచ్చే వాహనాలు కిలోమీటరు మేర నిలిచిపోయాయి. దీంతో సుమారు 6 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని క్రేన్ సాయంతో పక్కకు తొలగించారు. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు కర్నూలుకు చెందిన వాడిగా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేమెందుకు నడుస్తున్నామంటే..



మల్లవరం నుంచి పొదిలికి నడుస్తూ వెళ్తున్న బాలబాలికలు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన విద్యార్థులు గురువారం నడుస్తూ.. నానాతంటాలు పడుతూ పాఠశాలకు చేరుకున్నారు. కర్నూలులో ప్రధాని మోదీ సభకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులను అధిక సంఖ్యలో తరలించడంతో స్థానికంగా ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మల్లవరం గ్రామానికి చెందిన విద్యార్థులు భుజాన బ్యాగుల మోతతో సుమారు 5 కి.మీ నడిచి పొదిలిలోని ప్రభుత్వ పాఠశాలకు అతి కష్టమ్మీద చేరుకున్నారు. అధిక చార్జీ చెల్లించి ఆటోలు ఎక్కలేక కాళ్లకు పనిచెప్పారు.

